క్లుప్తంగా

రేపు దాసనవమి వేడుకలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ గురువు సమర్థరామదాసు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ ఆలయంలో దాసనవమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు అభయ్ ఆచార్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జయంతి పురస్కరించుకొని ఉదయం 7 గంటలకు అభిషేకం, 9 గంటలకు హారతి, రామదాసు రచించిన దాస్ బోధన పారాయణం చేయనున్నట్లు తెలిపారు. అనంతరం తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. రాత్రి 8 గంటల నుంచి భజనా కార్యక్రమం ఉంటుందని, కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోడ్డు పనులు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ సిద్ధి హనుమాన్ మహా జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం నది మధ్యలో నుంచి ఆలయం వరకు ఆదివారం మొరం రోడ్డు వేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు, ఆలయ పూజారి నారాయణ్ పటేల్, కమిటీ సభ్యులు ప్రవీణ్, తిరుపతి, నితేశ్, భారత్, సురేశ్ పాల్గొన్నారు.

కనకదుర్గాదేవి ఆలయంలో భక్తుల పూజలు



విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కనక దుర్గాదేవీతో పాటు మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని భక్తులతో పాటు పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఆలయ ప్రాంగణంలో ఉన్న మహంకాళి విగ్రహాన్ని దర్శించుకొని భక్తులు పూజలు చేశారు. పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తుల కోసం అన్నదానం ఏర్పాటు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

వాంకిడి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆసిఫాబాద్ మండలంలోని జెండగూడ గ్రామానికి చెందిన జాడి అశోక్ అనే వ్యక్తి ఆసిఫాబాద్ నుంచి మహారాష్ట్రకు బొలేరో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా వాంకిడి మండలం బంబార గ్రామ సమీపంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న 11.40 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మూడు రోజులుగా పాఠశాలకు తాళం



తాళం వేసి ఉన్న పాఠశాల

నార్నూర్: విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో గిరిజన విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగానే మారింది. కొంతమంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించక పోవడంతో ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో విద్య కుంటుపడుతోంది. గాదిగూడ మండలంలోని కునికాసా గ్రామపంచాయతీ పరిధిలోని కునికాసా కొలాంగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గత మూడు నెలల నుంచి తెరుచుకోవడం లేదు. దీంతో దాదాపు 20 మంది కొలాం గిరిజన విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు ప్రియమణి ప్రసూతి సెలవుపై వెళ్లడంతో పాఠశాలకు తాళం పడింది. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఏకోపాధ్యాయ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లితే విద్యార్థులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పాఠశాలలపై పర్యవేక్షణ కరువైందని గిరిజన సంఘాల నాయకులు వాపోతున్నారు. ఎంఈవో రాపల్లి ఆశన్నను వివరణ కోరగా ఉపాధ్యాయురాలు ప్రసూతి సెలవుపై వెళ్లిందని సమాధానం ఇచ్చారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వినూత్నంగా బోధన



లేండిగూడ పాఠశాల

- విద్యార్థులను ఆకర్షించేందుకు కొత్త పద్ధతులు
- సృజనాత్మకత పెంచేందుకు కృత్యాలు
- ప్రతీ కృత్యం యూట్యూబ్‌లో అప్‌లోడ్

కెరమెరి: మండలంలోని లేండిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మూస పద్ధతులకు స్వస్తి చెప్పి నూతన పద్ధతులతో తరగతులు బోధిస్తూ విద్యార్థులను ఆకర్షిస్తున్నారు. సమీపంలో మహారాష్ట్రకు చెందిన పాఠశాల ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల బోధన తీరు చూసి విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ఇక్కడికి పంపిస్తున్నారు. లేండిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 47 మంది విద్యార్థులు చదువుతుండగా, ఇద్దరు ఉపాధ్యాయులు



కృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఉన్నారు.

ప్రతీరోజు జీకే బోధన..

పాఠశాలలో సబ్జెక్టులతో పాటు ప్రతీరోజు జనరల్ నాలెడ్జ్‌ను కూడా బోధిస్తున్నారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ప్రతీరోజు 10 ప్రశ్నలు ఇచ్చి మరుసటి రోజు సమాధానాలు రాబడుతున్నారు. దీంతో విద్యార్థులు కుటుంబ సభ్యులతో మిత్రులతో జీకే గురించి చర్చిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యంతో పాటు బయటి అంశాలపై కూడా పట్టు లభిస్తుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు పాఠశాలలో జీకేకు సంబంధించిన 30 టెస్టులు నిర్వహించారు.

యూట్యూబ్‌తో మరింత ఉత్సాహం..

విద్యార్థుల్లో మరింత ఉత్సాహం పెంచేందుకు పాఠశాల హెచ్‌ఎం క్రాంతికుమార్ ప్రత్యేకంగా 'బిలీవర్స్ అకాడమీ' అనే యూట్యూబ్ చానల్ ప్రారంభించారు. పాఠశాలలో చేపట్టే అన్ని కృత్యాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. విద్యార్థులు యూట్యూబ్ వీడియోల్లో కనిపిస్తుండడంతో మరింత ఉత్సాహంగా వివిధ కృత్యాల్లో పాల్గొంటున్నారు. బడిలో విద్యార్థుల పుట్టిన రోజులను ఘనంగా నిర్వహిస్తుండడంతో పాటు కొత్త అంశాలపై విద్యా బోధన, ఆటలు, పాటలు, నృత్యాలు, గేయాలు, కథలతో సరికొత్త పద్ధతులను అవలంబిస్తున్నారు. దీంతో గ్రామంలోని మహారాష్ట్రకు చెందిన పాఠశాల విద్యార్థులు సైతం ఈ పాఠశాలకు వచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. కాగా అక్కడి విద్యార్థుల మాతృభాష మరాఠీ అయినప్పటికీ తెలుగు, ఆంగ్లంలో మాట్లాడగలగడం విశేషం.

ప్రతిభ వెలికితీస్తున్నాం



విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అనేక రకాల వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యూట్యూబ్‌లో వారి కృత్యాలు అప్‌లోడ్ చేస్తుండడంతో విద్యార్థుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. పాఠశాలలో హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– క్రాంతికుమార్, హెచ్‌ఎం, లేండిగూడ

మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీరోడ్లకు భూమిపూజ చేస్తున్న హరీశ్‌బాబు

పెంచికల్‌పేట్: గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని చేడ్వాయి, దర్గపల్లి, గుంట్లపేట్, లోడ్‌పల్లి, కొండపల్లి గ్రామాల్లో సీసీరోడ్లు, సబ్‌సెంటర్‌ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ. 10 కోట్లతో అంతర్గత రోడ్లు, కొండపల్లిలో రూ. 20 లక్షలతో సబ్‌సెంటర్లను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు జునగరి మధూకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పీఎం మోదీతోనే దేశాభివృద్ధి'

కెరమెరి: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి జరుగుతోందని బీజేపీ మండలాధ్యక్షుడు వేణు గోపాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఉన్న పార్టీలన్ని తమ స్వప్రయోజనాల కోసమే పని చేశాయని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి జరుగుతుందన్నారు. నేడు ఆదిలాబాద్‌లో జరుగనున్న మోదీ సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రావుల రాజేందర్, శేఖర్, శ్రీకాంత్, కిషన్ తదితరులు ఉన్నారు.

కౌటాల: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయ సంకల్పసభను విజయవంతం చేయాలని జిల్లా



కెరమెరి: మాట్లాడుతున్న వేణుగోపాల్

బీజేపీ కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్ ఆదివారం తెలిపారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని, బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో విజయసంకల్ప యాత్ర కోసం పీఎం నరేంద్రమోదీ రానున్నట్లు తెలిపారు. మండలంలోని బీజేపీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

వేసవిలో వాహనాలు జాగ్రత్త!

- పొంచి ఉన్న ప్రమాదాలు
- బైక్, కార్ల నిర్వహణ కీలకం
- ఎండలో సుదీర్ఘ ప్రయాణం వద్దు



జిల్లా కేంద్రంలో ఎండలో పార్క్ చేసిన బైక్‌లు

ఆసిఫాబాద్‌అర్బన్: భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వస్తే దాహం తీర్చుకోవడానికి శీతలపానీయాలు, పండ్లరసాలు తీసుకోవడం తప్పనిసరిగా మారింది. వేసవి తాపానికి గురికాకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాం. అదే విధంగా వాహనదారులు సైతం వాహనాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

దూర ప్రయాణాలు క్షేమం కాదు..

కొంత మంది ద్విచక్రవాహనాలపై దూర ప్రయాణాలు చేస్తుంటారు. వేసవికాలంలో దూర ప్రయాణాలు చేయకపోవడమే మంచిది. ఎండల్లో ఎక్కువ ప్రయాణించడం వల్ల ఇంజన్, టైర్లు వేడెక్కుతాయి. తద్వారా టైర్లు పేలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. బైక్‌లపై తప్పనిసరి పరిస్థితుల్లో దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే మార్గమధ్యలో చల్లటి ప్రదేశాల్లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటే వాహనాలు వేడెక్కకుండా ఉంటాయి.

ఎండలో పార్కింగ్ చేస్తే అంతే..

వాహనాలను ఎండలో పార్కింగ్ చేస్తే జేబుకు చిల్లులు పడడం ఖాయమంటున్నారు నిపుణులు. వేసవిలో వాహనాలకు కూడా ఎండ తాకిడి ఉంటోంది. రంగు వెలిసిపోవడం, పెట్రోలు ఆవిరైపోవడం వంటివి జరుగుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఎండలో ఇంజన్ ఆయిల్ త్వరగా వేడెక్కి పలుచనవుతుంది. ఎండాకాలం మొదలవగానే ఇంజన్ ఆయిల్ మార్చుకోవడం శ్రేయస్కరం. పెట్రోలు ట్యాంకుపై మందంగా ఉన్న కవర్ ఉండే విధంగా చూసుకోవడం వల్ల కొంతమేర పెట్రోలు ఆవిరి కాకుండా తగ్గించుకోవచ్చు. టైర్లు అరిగి ఉంటే మార్చుకోవాలి. ట్యూబ్‌లకు పంక్చర్లు ఉంటే వేసవి కాలంలో మార్చుకోవడం మంచిది. మధ్యాహ్నం ఎండలో ఎక్కువ సమయంలో పార్కింగ్ చేసి ఉంచితే వాహన జీవిత కాలం తగ్గుతుంది. వేసవిలో ఇంజన్ గార్డు తొలగించడం మంచిది. దూర ప్రాయాణమైతే బస్సులోనే వెళ్లడం ఉత్తమం. తప్పనిసరి పరిస్థితుల్లో వాహనం తీయాల్సి వస్తే మధ్య మధ్యన విరామం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల ఇంజన్ వేడి తగ్గుతుంది. రాత్రి సమయాల్లో ఒకసారి ట్యాంకు మూత తీసి తిరిగి పెడితే మంచిది. దీంతో గ్యాస్ బయటకు పోయి ఆయిల్ సులువుగా ఇంజన్‌లోకి వెళ్తుంది. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ద్విచక్రవాహనంపై ప్రయాణం చేయకపోవడమే ఉత్తమం.

వాహనాలను నీడలో నిలపాలి



ఎండాకాలంలో ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం తగ్గించుకోండి. ఎండ వేడికి టైర్లు పగిలిపోయే అవకాశం ఉంది. ప్యాచీలు కరిగి బైక్ అదుపు తప్పే ప్రమాదం ఉంది. ఇంజన్‌లో శబ్దం వచ్చి మొరాయిస్తుంది. నీడలో పార్కింగ్ చేయడంతో పాటు, మధ్యాహ్న సమయంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి.

– పాడుపుగంటి సోను, మెకానిక్, ఆసిఫాబాద్

రైల్వే ప్రయాణికులకు ఊరట

- కరోనా సమయంలో పెంచిన చార్జీలు తగ్గింపు
- రూ.30 టికెట్ ధర ఇకపై రూ.10లకే..

స్టేషన్	స్టేషన్	కొత్తచార్జి (రూ.లో)
కాగజ్‌నగర్	బల్లార్షా	20
కాగజ్‌నగర్	బెల్లంపల్లి	10
కాగజ్‌నగర్	రామగుండం	20
కాగజ్‌నగర్	పెద్దపల్లి	25
కాగజ్‌నగర్	జమ్మికుంట	30
కాగజ్‌నగర్	కాజీపేట్	40
కాగజ్‌నగర్	కరీంనగర్	30
కాగజ్‌నగర్	నిజామాబాద్	55
కాగజ్‌నగర్	బోధన్	60



కౌటాల: దేశంలో మొదటిసారి కరోనా విజృంభించిన సమయంలో రైల్వే శాఖ ప్రజారవాణా విషయంలో నిబంధనలు కఠినతరం చేసింది. ప్రత్యేక రైళ్లను నడిపించిన క్రమంలో ప్యాసింజర్ రైళ్ల టికెట్ ధరలు పెంచింది. ప్రస్తుతం పెంచిన ధరలను రద్దు చేసింది. ప్యాసింజర్, పుష్‌పుల్ రైలు ప్రయాణికులకు ఆర్డినరీ చార్జీలను పునరుద్ధరించింది. దీంతో టికెట్ ధరలు 50శాతం వరకూ తగ్గాయి. ఈ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల కనీస చార్జీని రూ.10లకు తగ్గిస్తూ కేంద్రప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కరోనా తర్వాత..

కరోనా తర్వాత రైల్వేశాఖ ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ స్పెషల్, మెము ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చింది. 200 కిలోమీటర్ల దూరానికి మించి ప్యాసింజర్ రైళ్లను నడపకూడదని భావించిన రైల్వే శాఖ, క్రమంగా ఆ రైళ్లను ఎక్స్‌ప్రెస్ స్పెషల్ ట్రైన్‌గా మార్చుతూ వచ్చింది. దీనికితోడు వేగం కూడా పెరగలేదు. కానీ సెకండ్‌క్లాస్ ఆర్డినరీ చార్జీలు మాత్రం పెరిగాయి. ఎక్స్‌ప్రెస్ రైలు చార్జీలతో సమానంగా కనీస చార్జీ ధర రూ.10 నుంచి రూ.30లకు పెంచారు. దీంతో సాధారణ ప్రజలపై భారం పడింది. దీనిపై సర్వత్రా విమర్శలు రావడంతో తాజాగా రైల్వే బోర్డు చార్జీలను పునరుద్ధరించి పాత చార్జీలనే వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గతంలో ప్యాసింజర్ రైళ్లుగా సేవలందించి, ఆ తర్వాత ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్‌గా మారిన రైళ్లన్నింటికీ ఈ మార్పు వర్తిస్తుంది. కొత్త చార్జీలు గత నెల 27 నుంచి అమలులోకి వచ్చాయి.

పల్స్ పోలియో విజయవంతం



దహెగాం: పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది

దహెగాం: పల్స్ పోలియో కార్యక్రమం మొదటి రోజు విజయవంతమైందని వైద్యాధికారిణి స్పందన అన్నారు. మండలంలో 0 –5 సంవత్సరాల లోపు చిన్నారులు 3,298 మంది ఉన్నారన్నారు. 58 బూత్‌లు, 6 రూట్‌లు, 5 మొబైల్ టీంలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆదివారం మొదటిరోజు 92.5 శాతం మందికి పోలియో చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు. సోమవారం, మంగళవారం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: పోలియో నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జెడ్పీటీసీ సముద్రాల సరిత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 –5 సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సరిత



లింగాపూర్: పోలియో చుక్కలు వేస్తున్న నర్సులు

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో 90 శాతం నమోదైనట్లు సీహెచ్‌వో శ్రీనివాస్ రెడ్డి, ఫార్మసిస్ట్ లీల్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ పెందోర్ మోతీరాం ప్రారంభించారు. మండలంలో మొత్తం 4418 మంది 0–5 ఏళ్ల చిన్నారులు ఉండగా, 3979 మందికి పోలియో చుక్కలు వేశారు. మొత్తం ఆరు రూట్లలో 176 మంది సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇష్తేకార్ అహ్మద్, ఎంపీవో ఎండీ అంజద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగాపూర్: మండలంలో ఆదివారం నుంచి పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో మొత్తం 26 పోలియో చుక్కల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 1390 మంది ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్నారని వైద్యుడు అజీమొద్దీన్ తెలిపారు. 29 పోలియో చుక్కల బూత్‌లను ఏర్పాటు చేసి, మొదటి రోజు 65శాతం పూర్తయినట్లు పేర్కొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో ఆదివారం పల్స్‌పోలియో విజయవంతమైంది. మండలకేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, పెట్రోల్‌పంపు, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రులతో పాటు గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో మొత్తం ఐదేళ్ల లోపు చిన్నారులు 3170 మంది ఉన్నారు. మండలంలో మొత్తం 25 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు నవత తెలిపారు.

కాగజ్‌నగర్‌రూరల్: పోలియో నిర్మూలన ఉద్యమం తుది దశకు చేరుకుందని ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్



సిర్పూర్ (టి): చుక్కలు వేస్తున్న డాక్టర్ నవత

బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాలో గల యూపీహెచ్‌సీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో చుక్కలు వేయడంతో పిల్లల్లో అంగవైకల్యం రాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం, సీహెచ్‌వో ఐజాక్, వాసుదేవు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రచారి, అనీసుద్దీన్, సీవో సదాలక్ష్మి, చంద్రయ్య, సుమిత్ గుప్తా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని అన్ని గ్రామాల్లోని చిన్న పిల్లలకు తప్పకుండా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 31 పోలియో కేంద్రాల్లో 2600 మంది చిన్నారులకు 2450 మంది పిల్లలకు చుక్కలు వేశామని హెచ్‌ఈవో సోనాజీ తెలిపారు.

రెబ్బెన: పోలియో రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్యలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వేర్వేరుగా పల్స్ పోలియో కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైద్యాధికారి సుజిత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మాజీ సర్పంచ్ గంటుమేర తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి: పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ

92శాతం నమోదు

మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం 92 శాతం పూర్తయిందని పీహెచ్‌సీ వైద్యాధికారి సుజిత్ తెలిపారు. మండలంలో 0–5 సంవత్సరాల లోపు 3176 మంది చిన్నారులు ఉండగా 2926 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు.

బెజ్జూర్: పోలియో రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన అన్నారు. ఆదివారం బెజ్జూర్ సీహెచ్‌సీ, గ్రామపంచాయతీ, గోల్కొండలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీహెచ్‌ఎస్ కమల, ఫార్మసిస్ట్ ఆయేషా, ఏఎన్‌ఎం సుస్మిత, సునీత, మంజుల, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం 92శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.



కాగజ్‌నగర్‌రూరల్: పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



కౌటాల: పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ విశ్వనాథ్



రెబ్బెన: పోలియో చుక్కలు వేస్తున్న అజ్మీర శ్యాంనాయక్

శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత



కవాతు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

వాంకిడి: శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కేంద్ర భద్రత బలగాలతో మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు శాంతియుత వాతావరణంలో సామరస్యంగా ఉండేందుకే కవాతు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జితేందర్ నందార్, ఇన్స్‌పెక్టర్ ప్రధాన్, రమేశ్ కుమార్, వాంకిడి ఎస్సై సాగర్, తదితరులు పాల్గొన్నారు.